
# స్వయంవరం



అనగనగా ఒక జమీందారు. ఆయనకు లేకలేక ఒక కొడుకు. ఆ కొడుకు విద్యాభివృద్ధికై జమీందారు గారు విపరీతంగా కృషిచేసిచేసి, కొన్నాళ్ల తర్వాత ఆ బాధ్యతను భార్య బంగారమ్మకు ఒప్పగిస్తూ విల్లురాసి వెళ్ళిపోయాడు. భర్త కోరిక ఈడేర్చాలన్న సంకల్పంతో ఆవిడ బస్తీ నుంచి పల్లెకు తరలివచ్చింది. అక్కడున్న చిన్న డాబా గోడలు ఎత్తు చేయించి, ఆమధ్య ఒక చిట్టి గది కట్టించి "నిరాఘాటంగా చదువుకొని మీ నాన్న ముద్దు చెల్లించు, బంగారు తండ్రీ" అవటాని కుమారరత్నాన్ని అందులో కూర్చోబెట్టింది. ఒక వయోవృద్ధుని గురువుగా నియమించింది. ఆ యిద్దరూ కాలు కదపనవసరం లేకుండా, భోజనాది వసతులన్నీ సమకూర్చి పెట్టింది.

ఏడాది తిరిగింది. అబ్బాయికి ఆయేటికాయేడు పైబడుతూందన్నారు బంధుకోటి. బంగారమ్మ గారి కొడుకు విషయంలో మాత్రం విద్యకి వివాహం వినాశనకారి కాజాలదంటే కాజాలదన్నారు పెళ్లీడు పిల్లలున్న అమ్మలక్కలు. పిల్లని తను ఏరితే పిల్లవాడి చదువుకి పిసరంత కూడా ఢోకా వుండదని బంగారమ్మ గారికి గట్టి నమ్మకం కుదిరింది. సరే అంది.

'ఊ' అన్నారు ఊళ్ళో చాలా మంది. బంగారమ్మ గారు గుమ్మం దిగే ఘటం కాదు. కొడుకును మేడ దిగనివ్వదు. అందుకని, మోజుగలవాళ్ళంతా పిల్లలను వాళ్లింటికే తీసుకువెళ్ళేవారు. ఈమాట అనోటా అనోటా ఊరూర పాకింది. బస్తీ కాలేజీలో చదువుతున్న చండిక, కాంచనమాల అనే యిద్దరమ్మాయిలు బంగారమ్మ గారి బంగారు పిచ్చిక సంగతి విని విస్తుపోయారు. కుతూహలం కలిగింది. చండిక, కాంచనమాల వాళ్ళ అసలు పేర్లు కావు. రూపురేఖా విలాసాల వల్ల ఇతరులు ఇచ్చిన బిరుదులు. చండిక విచ్చు రూపాయల్లె ఖంగున మోగుతూ వుంటుంది. రూపాయి అంచు గరుకుల్లో ఆమె మొహం మార్దవం లేకుండా వుంటుంది. కాంచనమాల సన్నగా పొడుగ్గా బక్కగా వుంటుంది. ఇద్దరూ పంతం వేసుకుని, ఆపైన కూడబలుక్కుని ఒకరోజు ఎవరికీ చెప్పకుండా బంగారమ్మగారి ఊరు బయలుదేరారు.

బంగారమ్మగారి ఇంటి గుమ్మంలోనే ఇంకో అమ్మాయి కూడా వాళ్ళకు తారసపడింది. ఆ అమ్మాయి పేరు శ్రీదేవి. చక్కగా ఉంటుంది. మంచివాళ్ళకి నెమ్మదస్తురాలు గాను, చెడ్డవాళ్ళకి వాజమ్మగాను కనబడుతుంది.

ముగ్గురూ చాపమీద కూర్చున్నారు. బంగారమ్మగారు వాళ్ళ పేరు, పుట్టు పూర్వాలు కనుక్కుంది. రెండు నిముషాలు ఆలోచించింది.

"ఓ పిల్లలూ మీ ముగ్గురికీ మూడు పనులు చెబుతాను. పది నిముషాలలో పూర్తిచెయ్యాలి. అప్పుడు మా ఇంటి కోడల్ని ఎన్నుకుంటాను" అంది.

సరేనన్నారు ముగ్గురు.

"ఓ చండికా! వసారాలో ఒక గడ్డపాయన ఉంటాడు. పేరు గడ్డంరాజు. మొండి. దేనికీ ఖాతరు లేదు. నువ్వు వెళ్ళి అతగాణ్ణి లేవగొట్టాలి. పొలానికి పంపి ఒక బండెడు తాటాకు తెప్పించాలి అతగాడిచేత." అంది బంగారమ్మ.

"ఓ అదెంత పని" అని ఎగిరి గంతేసింది చండిక.

"పిల్లా నీ పేరేమిటన్నావు? కాంచనమాల కదూ? పడకటింట్లో నా తమ్ముడి షడ్డకుడున్నాడు. మహా దొడ్డవాడు చదువులో. ఒఖ అడుగు అలా కరణం గారింటికెళ్ళి బస్తీలో ఇపుడు ఆడుతున్న బైస్కోపులేమిటో వాళ్ళ అబ్బాయిని కనుక్కుని వచ్చి చెప్పమను" అంది బంగారమ్మగారు.

"ఓ! ఇంతేకదా" అంది కాంచనమాల విలాసం ఒలకబోస్తూ.

"చిన్నదానా నీ పేరేమిటి?"

"శ్రీదేవి అంటారండి."

"సరే. పెరట్లో గడ్డివాము దగ్గర బొంత, దిండు వేసుకు కూర్చుని ఏగబిగిన తావుల కొద్దీ ఏదో రాసేస్తున్న జనపాల కవి ఒకడున్నాడు. కవిత్వం రాయించడానికి మా తమ్ముడి షడ్డకుడు వాణ్ణి తీసుకొచ్చాడు. ఇదిగో ఈ దస్తావేజు పట్టికెళ్లి కాస్త సాపు రాసి పెట్టమను. నిమిషం పని అని చెప్పు. కాస్త ముక్కోపి జాగ్రత్త" అంది బంగారమ్మ.

☆ ☆ ☆

ముందు బయలుదేరిన చండిక చరచర నడిచి, సరాసరి వసారాలోకి వెళ్ళింది. కుక్కి మంచం మీద కూర్చుని గడ్డం దువ్వుకుంటున్న గడ్డం రాజు కన్నెత్తి చూడలేదు. పన్నెత్తి పలకలేదు.

"ఏవయ్యోయ్, గెడ్డపాయనా, అలా పొలానికెళ్ళి ఓ బండి తాటాకులు పట్టించుకురా" అంది చండిక ధీమాగా. గెడ్డంరాజు కదలలేదు మెదలలేదు.

"ఈ ఇంటికి కాబోయే కోడల్ని నేను తెలుసా?"

గెడ్డంరాజు ఉలకలేదు, పలకలేదు. నిర్లక్ష్యంగా కూర్చున్నాడు.

చండికకు ఒళ్ళు మండిపోయి పెరట్లోకెళ్ళి పచ్చడిబండ పట్టుకొచ్చి, హుంకరించింది.

గడ్డంరాజు కన్నెత్తి చూచి, "మంచిదమ్మా వెళ్తున్నాను. గంటలో పట్టించుకొస్తా." అన్నాడు.

విలాసం ఒలకబోస్తూ బయలుదేరిన కాంచనమాల పడమటింట్లోకి వెళ్ళి బంగారమ్మ తమ్ముడి బావమరిదిని పలకరించి, ఇంటికి కాబోయే కోడల్ని అని చెప్పింది. 'ఓహో అలాగా' అని తలవంచుకు చదువు కొనసాగించబోయాడు.

కాంచనమాల, తను వచ్చిన పని చెప్పింది. బ్రతిమాలింది. బామాలింది.

బంగారుతండ్రి, బాచాల కొండ అంది. తనకన్న చిన్నది తనని అలా పిలవడంతో అతడు తలెత్తి కళ్ళు విప్పార్చి, సావకాశంగా చూశాడు కాంచనమాలను. కాస్త వెళ్ళి కనుక్కురమ్మంది కాంచనమాల. ఎప్పుడూ ఉండే చదువుకి అంతలో ముప్పేమీ ఉండదని హామీ ఇచ్చింది. ఎవరి మాటా వినని విద్యానిధి కాంచనమాల మాట కాదనలేక కరణంగారింటికి బయల్దేరాడు బైస్కోపు సమాచారం కోసం. దస్తావేజు కాగితం చేత పట్టుకొని, చిన్నచిన్న అడుగులు వేస్తూ బయలుదేరిన శ్రీదేవి, గడ్డివాము నీడలో హోరాహోరీగా కవిత్వం రాసేస్తున్న కవిని నెమ్మదిగా పలకరించింది.

'ఎవరవు తన్వీ, దివి నుండి భువికి దిగితివో భువినుండి దివి కేగుచుంటివో' అన్నాడు భావకవి. అంటూనే నాలిక కరుచుకున్నాడు.

"ఈ దస్తావేజు కాస్త సాపు రాసి పెట్టాలండి" అంది శ్రీదేవి వినయంగా. మన్నూ మిన్నుల మధ్య ఉన్నదంతా అదిరిపడేటంత కేకపెట్టాడు కవి. కొంతసేపు తెలుగులోనూ, ఆ తరువాత ఇంగ్లీషులోనూ కోప్పడ్డాడు. 'ఇన్‌సల్ట్' అనేశాడు. శ్రీదేవి హడలిపోయి కంటనీరెట్టుకుని సరాసరి ఇంట్లోకెళ్ళిపోయి బిక్కమొకం పెట్టుకూర్చుంది.

బంగారమ్మగారు సావిట్లోకి రాగానే చండిక గర్వంగా లేచి నిల్చొని, 'గెడ్డపాయన్ని పొలానికి పంపేశానమ్మా' అంది.

"మీ తమ్ముడి బావమరిది ముందు గునిసినా, చివరికి కరిగిపోయి కరణం గారింటికెళ్ళేరత్తయా" అంది కాంచనమాల.

"నువ్వేం చేశావు పిల్లా" అంది బంగారమ్మ.

శ్రీదేవి బావురుమంటూ, "ఆయన గసిరికొట్టారండి. దస్తావేజుకు సాపు రాయలేదు" అంది.

"నాతల్లే మాయింటి మాలక్ష్మి. నువ్వే నా యింటికి కోడలు కాదగ్గదానివి" అంది బంగారమ్మగారు శ్రీదేవిని ఆప్యాయంగా దగ్గరకు తీసికొని. చండిక మండిపడి హుంకరించింది.

"అదుగో అందుకే నువు నా కోడలు కావడానికి పనికి రావన్నది. గెడ్డంరాజుని హడలేసిన ఆడదానివి రేప్పొద్దున్న నా కొడుకుని నీచేతిలో కీలుబొమ్మ చేసుకోవూ! ఓ కాంచనమాలా! నువ్వూ పనికిరావు. నీ హొయలు నీ సొగసు చూస్తే మావాడి చదువు, నా ప్రతిజ్ఞ, ఆ మారాజు కోరిక బుగ్గిపాలయిపోతాయి. మాకు అన్ని విధాలా తగింది శ్రీదేవే. బంగారుతల్లి" అంది బంగారమ్మ గారు.

ఆ ఊళ్ళోనే ఆకాశమంత పందిరేసి, భూదేవంత అరుగేసి అందుమీద ముత్యాల ముగ్గులూ, రత్నాల రంగవల్లులూ తీర్చిదిద్ది, తన కుమార రత్నానికీ శ్రీదేవికీ పెళ్ళి చేసింది బంగారమ్మగారు. శ్రీదేవివంటి వెర్రిబాగుల పిల్ల దొరికింది కాబట్టి, తన కొడుకు చదువు నిరాఘాటంగా సాగుతుందనీ, తన లక్ష్యం సిద్ధిస్తుందనీ మురిసిపోయిందావిడ.

ఇలా కొంతకాలం సాఫీగా సాగిపోయేసరికి ఒక ఏడాది జూన్ 18న బంగారమ్మ గారి కుమారుడు మెట్రిక్యులేషన్ ప్యాసై ఊరుకున్నాడు.

★ ★ ★